తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





## జిల్లా ఎస్పీచే కమాండ్ కంట్రోల్‌రూం ప్రారంభం



వి.కోట, డిసెంబర్ 26 ప్రభాతవార్త
వి.కోట అర్బన్ పోలీస్ స్టేషన్‌లో గురువారం కొత్తగా కమాండ్ కంట్రోల రూ ంను జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న వి.కోట ప్రాంతంలో నేరాలు అదుపు చేసేందుకు సిసి కెమెరాలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. వి.కోట పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో నిఘా ఉంచామన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో పలు కేసులకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో పలమనేరు డిఎస్పీ ప్రభాకర్, సిఐ సోమశేఖర్‌రెడ్డి, ఎస్సై బాబు, బైరెడ్డిపల్లి ఎస్సై పరశురాం, సిబ్బంది పాల్గొన్నారు.

## నాటు వైద్యం చేస్తానని నమ్మించి మహిళ వద్ద బంగారు ఆభరణాలు చోరీ

తడ, డిసెంబర్ 26 ప్రభాతవార్త
మోకాళ్ల నొప్పులకు నాటు వైద్యం చేస్తానని చెప్పి ఒక మహిళ వద్ద బంగారు నగలు చోరీ చేసిన సంఘటన గురువారం తడ మండలం కారిజాత పంచాయతీ పరిధిలోని పాములమిట్టలో జరిగింది. కామిరెడ్డి శాంతమ్మ కొంతకాలంగా కాళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. గురువారం మధ్యాహ్నం ఒక అపరిచిత వ్యక్తి గ్రామంలోకి చొరబడి ఆమె పేరు చెప్పి అడ్రస్ కనుక్కొని మరీ ఇంటికి వెళ్లి ఆమెతో మాట్లాడాడు. నమ్మించి ఈ చోరీకి పాల్పడినట్లు చెప్తున్నారు. మందు వేయడానికి పసుపు నీళ్లు కావాలని ఆమె వద్దనే తెప్పించుకొని ఆ నీటినే ముఖం మీద చల్లి ఆమె మెడలోని సుమారు ఆరున్నర సవర్ల బంగారు గొలుసును తస్కరించినట్లు గ్రామస్థులు చెప్తున్నారు. అయితే వైద్యంలో భాగంగా నగలు కూడా తీసి తన ముందు పెట్టమని అతను ఆదేశించడంతో ఆమె ఏమరుపాటున వాటిని అతనికి ఇచ్చినట్లు కూడా మరికొందరి వాదనగా ఉంది. పోలీసులకు సమాచారం అందడంతో సంఘటన స్థలానికి వెళ్లి విచారించినట్లు తెలిసింది.

### ఆఫ్‌లైన్ టోకెన్లు జారీ కౌంటర్ల వద్ద

# సకల సౌకర్యాలు

### టిక్కెట్, టోకెన్ ఉంటేనే ఆలయంలోనికి అనుమతి
### టిటిడి అదనపు ఈఓ వెంకయ్యచౌదరి



తిరుమల,డిసెంబర్ 26ప్రభాతవార్తప్రతినిధి:
జనవరి 10నుండి 19వతేదీ వరకు పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలకు ఆఫ్‌లైన్‌లో తిరుపతిలో టోకెన్లు జారీచేసే ప్రాంతాల్లో భక్తులకు సకల సౌకర్యాలు కల్పించాలని టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి అధికారులను ఆదేశించారు. వైకుంఠద్వార దర్శన టిక్కెట్లు, టోకెన్లు ఉన్న భక్తులను నిర్దేశించిన రోజే తిరుమలకు అనుమతించాలని, టిక్కెట్లు, టోకెన్లు లేకుంటే భక్తులను ఆలయంలోనికి అనుమతించడం జరగదన్నారు. పదిరోజుల వైకుంఠద్వార దర్శనాల ఏర్పాట్లు, భక్తులకు సౌకర్యాల కల్పనపై గురువారం తిరుమల అన్నమయ్యభవనంలో టిటిడి సివిఎస్ఓ శ్రీధర్, సిఇ సత్యనారాయణ, విఎస్ఓలు ఎస్టీవిరామ్‌కుమార్, అల్లంసురేంద్ర, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, వసతికల్పనవిభాగం డిప్యూటీ ఈఓలు భాస్కర్, పి.హరీంధ్రనాథ్,రవాణా జిఎం శేషారెడ్డితో కలసి అదనపు ఈఓ వెంకయ్యచౌదరి సమీక్షించారు. పార్కింగ్ సమస్య లేకుండా ప్రత్యేక పార్కింగ్‌లు, పార్కింగ్ వద్ద నుండి క్యూలైన్‌లవద్దకు వెళ్ళేందుకు ఉచిత బస్సులు ఏర్పాటు చేయాలన్నారు.

# హెల్మెట్ పెట్టేదెవరు!?

### అవగాహన సరే ఆచరణ ఏదీ ?



ప్రభాతవార్త-తిరుపతి :
రాష్ట్ర ఉన్నతన్యాయస్థానం ఉత్తర్వులతో ద్విచక్రవాహనదారుడు సురక్షితంగా వాహనాలు నడిపి, ప్రాణాలను కాపాడుకోవడంలో శిరస్త్రాణం(హెల్మెట్)ధరించడం తప్పనిసరి ఆదేశాలిచ్చినా ఆచరణలో పెట్టేదెవరనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. హెల్మెట్ ధరించి బండి నడపాలని పోలీసులు అవగాహన కల్పిస్తున్నా ఆచరణలో పెట్టేవారే లేకపోతున్నారు. గత నాలుగురోజులుగా తిరుపతి నగరంలోహెల్మెట్ ధరించి వాహనాలు నడుపుతున్న వారిని వ్రేళ్ళపై లెక్కించవచ్చు. నగరంలో నాలుగులక్షల పైవరకు ద్విచక్రవాహనాలు ఉన్నాయి. ఇందులో కనీసం సగంశాతంమందికి కూడా హెల్మెట్లు లేవంటే ఆశ్చర్యపోవలసిన విషయం లేదు. పైగా ఇప్పటివరకు పలు దఫాలుగా ఆరేడుసంవత్సరాల క్రిందట హెల్మెట్ ధారణ తప్పని సరిచేసినా చివరకు ఆచరణలో కొంత విఫలమైన పోలీసుశాఖ ఇప్పుడు మళ్ళీ రాష్ట్ర ఉన్నతన్యాయస్థానం ఉత్తర్వులతో అమలుచేయక తప్పడంలేదు. ఇప్పటికే 90శాతంమంది వాహనదారులు హెల్మెట్ వైపు కన్నెత్తికూడా చూడలేదు. పైగా మార్కెట్లో హెల్మెట్ ధర కూడా అమాంతంగా 1,500 రూపాయల నుండి 2,500రూపాయల వరకు ఉందని అంటున్నారు. అయితే సాధారణ,మధ్య తరగతి వర్గాల వారికి హెల్మెట్‌లు ఇప్పటికీ అందుబాటులో లేదు. తిరుపతిలో ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధారణ టెర్రర్‌గా మారింది.నగరంలో హెల్మెట్ ధరించాలనే విషయంపై చాలావరకు విధుల్లో ఉన్న పోలీసులు,ట్రాఫిక్ పోలీసులు కూడా హెల్మెట్ ధరించకపోవడం మరో కొస మెరుపు. ద్విచక్రవాహనం నడిపే ప్రతివ్యక్తి తలకు సురక్షితంగా హెల్మెట్ ధరించడమనేది బాధ్యత. మరీ మన పోలీసులు ఈ విషయంపై ఎంతవరకు చట్టప్రకారం ముందుకు కదులుతారో చూడాల్సిందే.

### జిల్లాలో గుంతలు లేని రోడ్లు

# సంక్రాంతికి పూర్తి చేయాలి

### పనుల్లో నాణ్యత పాటించాలి : కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి కలెక్టరేట్, డిసెంబరు 26 ప్రభాతవార్త ః



జూమ్ కాన్ఫెరెన్స్‌లో జిల్లా ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్

గుంతలు లేని రోడ్డే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన మిషన్ హోల్ ఫ్రీ గుంతల రహిత ఏపీ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి పెట్టిందని ఆ దిశగా జిల్లా వ్యాప్తంగా గుంతలు లేని రోడ్ల పనులను సంక్రాంతి నాటికి పూర్తి చేసేలా చూడాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్ చాంబర్ నందు జూమ్ కాన్ఫెరెన్స్ ద్వారా ఆర్అండ్‌బి అధికారులు నేషనల్ హైవే పీడీలు మున్సిపల్ కార్పొరేషన్ ఇంజనీర్‌లతో మిషన్ హోల్ ఫ్రీపై సమీక్షించి మాట్లాడారు. జిల్లాలో గుంతలు లేని రోడ్ల పనులను పూర్తి చేసి పురోగతిలోకి తీసుకుని రావాలని, ప్రణాళిక బద్ధంగా మరమ్మతుల విషయంలో ఎలాంటి అలసత్వం లేకుండా వెంటే పూర్తి చేయాలని తెలిపారు. మెటీరియల్ నాణ్యతో పాటు రహదారులు ఎక్కువ కాలం పాటు మన్నేలా నాణ్యత పనులను చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

# కుప్పంలో మోడల్ బస్‌స్టేషన్‌కు చర్యలు

### ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం
### విజయవాడ.. తిరుపతికి నూతన బస్సులు ప్రారంభం !!



నూతన బస్సులను ప్రారంభిస్తున్న దృశ్యం

కుప్పం, డిసెంబర్ 26 ప్రభాతవార్త
కుప్పం పట్టణంలో సుమారు అరవై కోట్ల నిధులతో మోడల్ బస్‌స్టేషన్ నిర్మాణంకు సిఎం చంద్రబాబునాయుడు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. గురువారం కుప్పం డిపోలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్‌తో కలసి కుప్పం - విజయవాడకు రెండు, కుప్పం - తిరుపతికి మూడు నూతన ఆర్టీసీ బస్సులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ ఛైర్మన్ మాటా ్లడుతూ సిఎం చంద్రబాబు ఆదేశాలతో కుప్పం డిపోకు అతిత్వరలోనే ఎలక్ట్రిక్ బస్సులను తీసుకురావడం జరుగుతుందన్నారు. కుప్పం ప్రాంతంలో రోడ్డు సౌకర్యం ఉన్న గ్రామీణ ప్రాంతాలకు బస్సులు నడిపేలా చర్యలు తీసుకున్నామన్నారు. మరో పక్క ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులకు తగు సహకారం అందిస్తోందన్నారు. గత వైకాపా ప్రభుత్వం తీసేసిన నైటౌట్ నగదును తమ ప్రభుత్వం మరలా అందిస్తోందన్నారు. కుప్పం డిపోను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారా ం, వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ వేణుగోపాల్, కౌన్సిలర్ సోమశేఖర్, మాజీ ఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, నేతలు ఆర్ముగం, మంజు, నరేష్, వెంకటేష్, శివశంకర్, బలరాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.

### షార్‌లో పిఎస్ఎల్‌వి-సి60 రాకెట్‌లో

# ఉపగ్రహాల అనుసంధానం పూర్తి



శ్రీహరికోట (తడ), డిసెంబర్ 26 ప్రభాతవార్త
శ్రీహరికోట నుంచి ఈ నెల 30న జరగనున్న పిఎస్ఎల్‌వి-సి60 రాకెట్ నిర్మాణ పనులకు సంబంధించి ఉపగ్రహాల అమరిక పూర్తి చేశారు. స్పేడెక్స్‌కు సంబంధించిన రెండు ఉపగ్రహాలను ఈ రాకెట్‌లో అనుసంధానం చేశారు. ఇప్పటికే రాకెట్ నాలుగవ దశలో 24 ఉపకరణాలను ముందుగానే అమర్చి ఉన్నారు. స్పేడెక్స్ ఉపగ్రహాల అనుసంధానం పూర్తయిన తర్వాత రాకెట్ ప్రయోగానికి సిద్ధమైంది. శాస్త్రవేత్తలు తుది సమావేశాలు, సమీక్షలు నిర్వహించిన తర్వాత ఖచ్చితమైన సమయాన్ని నిర్ధారిస్తారు. ఇప్పటికి 30న రాత్రి 9.58 గంటలకు ప్రయోగ సమయాన్ని నిర్ధారించినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ ఉపగ్రహాలు మన దేశానికి సంబంధించిన తొలి స్పేస్ డాకింగ్ ఉపగ్రహాలుగా శాస్త్రవేత్తలు తెలిపారు.

# పాచిపట్టిన బిక్షాల గాలిగోపురం

శ్రీకాళహస్తి,డిసెంబర్ 26 ప్రభాతవార్త
సుమారు రెండు నెలలుగా ఎడతెరపిలేని వానలు, ముసారతో విపరీతమైన చలి చోటు చేసుకుంది. అయితే ముసారతో,వర్షాలతో పవిత్రమైన బిక్షాల గాలిగోపురం పాచిపట్టి పచ్చగా దర్శన మిస్తుంది. ఇక రాజగోపురం పై కూడా అక్కడక్కడా పిచ్చిమొక్కలు పెరిగి దర్శనమిస్తుంది. గత ఐదేళ్ళలో ప్రతి ఏడాది బిక్షాల గాలిగోపురం వైట్ కలర్‌ను వేసారు.కానీ ఎంత వరకు నాణ్యతతో పని చేసారో ఏమో కాని తెల్లగా మంచులా దర్శనమిచ్చే బిక్షాల గాలిగోపురం నేడు ఆకపచ్చగా మారింది. చూపరులు ఇదేమి రంగు అని చర్చించుకుంటున్నారు. వర్షానికి గోపురం పాచిపట్టి పచ్చటి రంగులా మారగా పిచ్చి మొక్కలు పెరిగి దర్శనమిస్తున్నాయి. అయితే రాబోవు మహాశివరాత్రికి పెయింటింగ్ చేయటం ఆనవాయితి కాబట్టి పెయింటింగ్ చేస్తారని చెబుతున్నారు. ఇక వరుస వర్షాలతో ఇళ్ళలో బూజుపట్టి మగ్గుడు వాసన చోటు చేసుకుంది. ఇళ్ళలో బట్టలను ఉతికి ఆరవేయాలంటే ఎండటం లేదని జనం వాపోతున్నారు. వర్షాలు తగ్గాయి.గురువారం సూర్యభగవానుడు ఉదయం 10గంటల తరువాత దర్శనమిచ్చాడు. కానీ భూమిలో తేమ బురద ఆరలేదు.




పాచిపట్టి పచ్చగా దర్శనమిస్తున్న బిక్షాల గాలిగోపురం

# పక్కాగా క్యాన్సర్ స్కానింగ్ పరీక్షలు

### కలెక్టర్ సుమిత్‌కుమార్



వైద్య అధికారులతో సమీక్షిస్తూ మెడికల్ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, డిసెంబర్ 26 ప్రభాతవార్త:
జిల్లాలో ఎన్‌సిడి-సిడి 3.0 సర్వేను ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు క్షేత్ర స్థాయిలో ఇంటింటికి వెళ్ళి పక్కాగా నిర్వహించే దిశగా మెడికల్ ఆఫీసర్లు పని చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో గురువారం కలెక్టర్ సుమిత్‌కుమార్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో ఎన్‌సిడి సర్వేపై మెడికల్ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్‌సిడి సర్వేలో భాగంగా చేస్తున్న ఆరోగ్య పరీక్షలో భాగంగా చేస్తున్న ఆరోగ్య పరీక్షల్లో జిల్లాలోని ప్రతి ఒక్కరిని వారి ఇంటి వద్దకు వెళ్ళి పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సమాచారంను డిజిటలైజేషన్ చేయడం దీని ప్రధాన ఉద్దేశం అన్నారు. ఈ సర్వేలో ప్రధానంగా రక్తపోటు(బిపి)ను పరీక్షించుట, బ్లడ్ గ్లూకోజ్(మధుమేహం)ను పరీక్షించుట, హిమోగ్లోబిన్‌ను పరీక్షించుట, బిఎంఐను చూడటం జరుగుతుందన్నారు. అలాగే మహిళలకు క్యాన్సర్‌కు సంబంధించి ఎలాంటి లక్షణాలు వున్నా అలాంటి అనుమానిత కేసులను గైనకాలజిస్టులతో పరీక్షించి స్క్రీనింగ్ నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి పంపాలన్నారు. ఈ ప్రక్రియలో ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు క్యాన్సర్‌కు సంబంధించి వున్న ప్రశ్నావళిని పూరించడంలో సరైన అవగాహన కలిగి వుండేలా మెడికల్ ఆఫీసర్లు కృషి చేయాలన్నారు. అలాగే వారి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. అనుమానిత కేసులకు సంబంధించిన మహిళలు భయాందోళన లేకుండా వారికి అవసరమైన వైద్య సేవలు అందించాలన్నారు. అలాగే జిల్లాలో జరుగుతున్న ఇమ్యునైజేషన్‌లో భాగంగా పిల్లలకు ఓపివి, డిటిపి, హెపటైటిస్ బి, ఇతర వాక్సినేషన్లకు సంబంధించి జిల్లాలో పుట్టిన పిల్లలకు, వారికి వేసిన వాక్సినేషన్‌కు తేడా కలదని, మెడికల్ ఆఫీసర్లు వారి పరిధిలో వున్న పబ్లిక్, ప్రైవేటు ఆసుపత్రుల్లో పుట్టిన పిల్లల పూర్తి వివరాలను వాక్సినేషన్ చేసిన వారి వివరాలను పూర్తి పారదర్శకంగా సిద్ధం చేసి వారం రోజుల్లో సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో పుట్టిన బిడ్డ నుండి ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు సంబంధించి పూర్తి సమాచారంను ప్రతి మెడికల్ ఆఫీసర్ వారి వద్ద అందుబాటులో వుంచుకోవాలని, వాక్సినేషన్‌కు సంబంధించి పూర్తి సమాచారం వుండాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి, డిసిహెచ్ఎస్ డాక్టర్ ప్రభావతి, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటప్రసాద్, ఇతర మెడికల్ ఆఫీసర్లు, అధికారులు పాల్గొన్నారు.

### గణనాధుని సన్నిధిలో

# ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి

కాణిపాకం, డిసెంబర్ 26 ప్రభాతవార్త:



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి, మరియు ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా గురువారం కుటుంబ సమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయం వెలుపల జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఆలయం రాజగోపుం వద్ద ఆలయ ఈఓ పెంచల్ కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా కలెక్టర్ స్వామివారి శేషవస్త్రాలను,ఈఓ పెంచల కిషోర్ చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు. వారి వెంట చిత్తూరు అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, ఎక్సైజు శాఖ ఈఎస్ శ్రీనివాస్, నాగమలేశ్వర్ డీఎస్పీ వాసుదేవచౌదరి, ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, ఐరాల తహశీల్దార్ మహేష్‌కుమార్, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు తదితరులు పాల్గొన్నారు.

#### ముఖేష్‌కుమార్ మీనాను కలసిన పూతలపట్టు ఎమ్మెల్యే

కాణిపాకం ఆలయ దర్శనార్థం వచ్చిన ఎక్సైజు శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనాను ఆలయ అతిథి గృహంలో పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర భ్ంగా ముఖేష్‌కుమార్ మీనాతో పాటు కలెక్టర్ సుమిత్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీలను శాలువాలతో సత్కరించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ పెంచల కిషోర్, అధికారులు

### చిత్తూరు బార్ అసోసియేషన్ కుర్చీ కోసం

# హోరాహోరీ పోరు

**- అధ్యక్ష పదవి చేజిక్కించుకోవడానికి 5 మంది సీనియర్ లాయర్లు పోటీ**




చిత్తూరు బార్ అసోసియేషన్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ

చిత్తూరు, డిసెంబర్ 26 ప్రభాతవార్త:
జిల్లా కోర్టు పరిధిలోని చిత్తూరు బార్ అసోసియేషన్ ఎన్నికల యుద్ధం హోరా హోరీగా సాగుతుంది. చిత్తూరు న్యాయవాద సంఘ ఎన్నికల బరిలో 28 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. చిత్తూరు బార్ అసోసియేషన్ కార్యవర్గంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల పదవులు కీలకం కావడంతో ఈ రెండు పదవుల కోసం లాయర్ల మధ్య హోరా హోరీ పోరు నడుస్తోంది. చిత్తూరు బార్ అసోసియేషన్ పరిధిలో సుమారు 400 మంది లాయర్లు ఓటు హక్కును కలిగి వున్నారు. అధ్యక్ష పదవి కోసం ఐదు మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసి సై అంటే సై అంటూ ప్రచారం చేపట్టారు. అలాగే ప్రధాన కార్యదర్శి పదవి కోసం ముగ్గురు లాయర్లు నామినేషన్ దాఖలు చేసి ప్రచారం ముమ్మరం చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవి కోసం జరుగతున్న ఎన్నికల్లో గురువారం నామినేషన్ల దాఖలు ప్రక్రియ ముగియడంతో, శుక్రవారం నామినేషన్ల పరిశీలన, శనివారం నామినేషన్ల ఉపసంహరణ వుంటుంది. జనవరి 3వ తేదీ చిత్తూరు బార్ అసోసియేషన్‌కు ఎన్నికలు జరుగనున్నాయి. చిత్తూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవి కోసం సీనియర్ లాయర్లు కె.శంకర్‌నాయుడు, ఎం.చంద్రశేఖర్, వి.మోహన్‌రామిరెడ్డి, హరికృష్ణమనాయుడు, జానకిరామ్‌రెడ్డిలు పోటీ పడుతున్నారు. ఇప్పటికే వీరు ప్రచారం చేపట్టి ఎలాగైనా ఓటర్లుగా వున్న లాయర్ల మద్దతు పొందడానికి తమ వంతు ప్రయత్నాలు సాగిస్తున్నారు. అలాగే ప్రధాన కార్యదర్శి పదవి కోసం చక్రవర్తిరెడ్డి, సురేష్‌రెడ్డి, యు.విశ్వనాథ్‌లు పోటీ పడుతున్నారు. వీరు సైతం నామినేషన్లు దాఖలు చేసి ఓటర్ల మద్దతు సాధించడానికి తమ వంతు ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నారు. చిత్తూరు బార్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికల్లో మొత్తం 28 మంది తమ అదృష్టంను పరీక్షించుకోవడానికి ఎన్నికల బరిలో నిలిచారు. చిత్తూరు బార్ అసోసియేషన్ ఎన్నికల అధికారిగా నియమితులైన సీనియర్ న్యాయవాది జి.వసంతకుమార్ అభ్యర్థుల నుండి నామినేషన్లను స్వీకరించి, ఎన్నికల నిర్వహణ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు.

## రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

**-మంగళం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 69 అర్జీలు -తిరుపతి అర్బన్ తహశీల్ధార్ భాగ్యలక్ష్మీ**

**తిరుపతిరూరల్,డిసెంబర్ 26 ప్రభాతవార్త:**



రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకొని, భూ వివాదాలు, భూ సమస్యలు పరిష్కరించుకోవాలని తిరుపతి అర్బన్ తహశీల్దార్ భాగ్యలక్ష్మీ కోరారు. గురువారం మంగళం ప్రాధమిక పాఠశాలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 69 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. సదస్సుకు వచ్చిన ప్రతి అర్జీని అన్‌లైన్ చేసి, అర్జీదారుడికి రిషీప్ట్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రెవెన్యూ సదస్సులలో ఏ1 రిజిస్టార్/పెయిర్ అడంగల్, వెబ్‌ల్యాండ్ అడంగల్, మాన్యువల్ అడంగల్, 10(1) రిజిస్ట్రార్, 22(ఎ) రిజిస్ట్రార్స్, ఆర్‌ఓఆర్-1, ఆర్‌ఓఆర్-1బి, హౌస్ సైట్ రిజిస్ట్రార్, కోర్టు కేసుల వివరాలను తెలుసుకోవడంతో పాటు కొన్ని రెవెన్యూ సమస్యలను రెవెన్యూ సదస్సులో పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. ఈ సదస్సులో ఉప తహశీల్థార్ రామచంద్ర, అర్బన్ సర్వేయర్ జగదీష్, ఆర్ఐ క్రిష్ణమ్మ, విఆర్వోలు సతీష్,ప్రసాద్, లతశ్రీ, ప్రసన్నశ్రీ, సంధ్య, నారాయణ, వినిత తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ పరీక్షలలో 5 మంది డీబార్

**తిరుపతి విద్య డిసెంబర్ 26 ప్రభాత వార్త:**

ఎస్వీయూ పరిధిలో గురువారం జరిగిన డిగ్రీ మూడవ,ఐదవ సెమిస్టర్ పరీక్షలలో ఐదు మంది విద్యార్థులు మాల్ ప్రాక్టీస్ కు పాల్పడుతూ డీబార్ కు గురైనట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ మూడే దామ్లానాయక్ తెలిపారు. హైపవర్ ఇన్స్పెక్షన్ కమిటీ ఇచ్చి సమాచారం మేరకు మదనపల్లి జోన్లోనే ఐదుమంది విద్యార్థులను డీబార్ చేసినట్లు తెలియజేశారు.అలాగే ఎస్వీయూ పరిధిలో ఈ ఏడాది మార్చిలో జరిగిన బీఫార్మశీ మెదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలను గురువారం విడుదల చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఫలితాల కోసం వర్సిటీ అధికారిక వెబ్సైట్ ను సంప్రదించాలని సూచించారు.

## వికసిత్ భారత్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎస్వీయూ విద్యార్థులు

**తిరుపతి విద్య డిసెంబర్ 26 ప్రభాతవార్త:**

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వికసిత్ భారత్ 2047లో భాగంగా రాష్ట్రంలోని అన్ని వర్సిటీలలో విద్యార్థులలోని సృజనాత్మక శక్తిని,నూతన ఆలోచనలను ప్రోత్సహించేందుకు క్విజ్, పవర్పాయింట్ ప్రజెంటేషన్,వ్యాసరచన పోటీలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఈనెల 30వతేదీన నాగార్జున యూనివర్సిటీలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎస్వీయూ ఫిజిక్స్ విభాగం నుంచి పూర్ణిమ,లక్ష్మీ లావణ్య, వరలక్ష్మీ,కుసుమ ఎంపికయ్యారు.ఈ సందర్భంగా వీసీ సీహెచ్ అప్పారావు,రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ప్రిన్సిపల్ రామకృష్ణారెడ్డి, ఫిజిక్స్ హెడ్ ప్రొఫెసర్ దేవప్రసాద్రాజు బెస్ట్ ఆఫ్ లక్ చెబుతూ అభినందించారు.

## వైసీపీకి పూర్వవైభవం తీసుకువద్దాం - వైసీపీ అధ్యక్షుడు భూమన

**నగరి, డిసెంబరు 26 ప్రభాతవార్త:**



పార్టీకి మళ్లీ పూర్వవైభవం తీసుకువద్దామని చిత్తూరు, తిరుపతి జిల్లాల వైసీపీ అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణ పరిధి ఏజేఎస్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి లాంటి నాయకుడు ప్రపంచ రాజకీయాల్లో ఎక్కడా లేరన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే ప్రజల్లో తేలిపోయిందన్నారు. .

**ఆశల పల్లకి నరకు వాకిలి చూపుతోంది - రోజా**

ఎన్నికల ముందు పచ్చ నేతలు సూపర్‌సిక్స్ అంటూ చూపిన ఆశల పల్లకిలో జనం ఎక్కేశారని, అయితే ఆ పల్లకి ఇప్పుడు వారికి నరకపు వాకిలి చూపుతోందని మాజీ మంత్రి రోజా అన్నారు. వైసీపీ పార్టీ తప్పులు చేసి ఓడిపోలేదని తప్పుడు ప్రచారం వల్ల ఓడిపోయిందన్నారు. ఎన్నికల ముందు అరచేతిలో వైకుంఠం చూపిన చంద్రబాబు అధికార నరకం చూపుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని పక్కన పెట్టి లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలుచేస్తున్నారని తిరుపతిఎంపీ గురుమూర్తి అన్నారు. ప్రజలను మోసంచేయడంలో సిద్ధహస్తుడు చంద్రబాబునాయుడు అని చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప అన్నారు. వైసీపీ ప్రజాధరణ కోల్పోతే ఈవీఎంస్కామ్ వల్లే కూటమి అధికారంలోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్లు, ఎంపీపీలు, వైస్ చైర్మన్లు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో-ఆప్షన్ సభ్యులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## భూసమస్యలు పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

**తొట్టంబేడు, డిసెంబర్ 26 ప్రభాతవార్త**



రెవెన్యూ సదస్సుల్లో భాగంగా గురువారం మండలంలోని రౌతుసూరమాల పంచాయతీలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి తహశీల్దార్ మధుసూధనరావు హజరయ్యారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ అన్నదాతల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించేందుకే ప్రభుత్వం ఈపథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. గ్రామాల్లో అన్నదాతలకు సమస్యలు ఉండకుండా రెవెన్యూ కార్యాలయాల చుట్టు తిరగకుండా ఉండేలా చూస్తామన్నారు. మండలంలోని 27 పంచాయతీలు 41 రెవెన్యూ గ్రామాల్లో ఈసదస్సులు జరుగుతాయని వివరించారు. వచ్చే నెల 8వ తేదీ వరకు జరుగుతాయని గ్రామంలోని ప్రతి రైతు ఈసమస్యను పరిష్కరించుకోవచ్చని తహశీల్దార్ వివరించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నారాయణస్వామి పలువురు అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఓ పత్రిక ప్రతినిధిని బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలి

**- జర్నలిస్ట్ సంఘాల ఆధ్వర్యంలో ఎస్పీకి ఫిర్యాదు**

**తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 26, ప్రభాతవార్త**



ఓ దినపత్రిక లో ప్రచురించిన న్యూస్ పైన, ఆ పత్రిక ప్రతినిధికి పాకాలకు చెందిన వార్డు మెంబర్ రావిళ్ళ మోహన్ నాయుడు ఫోన్ చేసి నోటికి వచ్చినట్లు తిట్టడం జరిగింది. జరిగిన సంఘటనపై గురువారం తిరుపతిలోనే వివిధ జర్నలిస్టుల సంఘాలు ఆధ్వర్యంలో తిరుపతి ఎస్పీకి అతని మీద కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ నాయకులు కోలా లక్ష్మీపతి, ఏపీయూడబ్ల్యూజే నాయకులు మబ్బు నారాయణరెడ్డి, తిరుపతి ప్రెస్ క్లబ్ జాయింట్ సెక్రెటరీ విజయ్ యాదవ్, గిరిధర్, ఉమాపతి, ప్రవీణ్, ఫోటోగ్రాఫర్ ప్రవీణ్, పరమేష్ రాజు, రాజేష్, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు పరిశోధనల వైపు అడుగులు వేయండి

**డాక్టర్ నరసింహ గొల్ల**

**రామచంద్రాపురం, డిసెంబర్ 26, ప్రభాతవార్త**



పార్మసి విద్యార్థులు పరిశోదనల వైపు అడుగులు వేయాలని ఎస్వియు పరిశోధన, అభివృద్ధి డైరెక్టర్ డాక్టర్ నరసింహ గొల్ల అన్నారు. గురువారం వెంకట్రామాపురం సమీపంలోని సెవెన్ హిల్స్ పార్మసి కళాశాలలో వర్క్‌షాపును ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచారాన్ని శోదించడం, గుర్తిం చడం, నిర్వహించడం సరి అయిన పద్దతి లో తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పోగ్రాం కన్వీనర్ శరవణ కుమార్, ప్రొపసర్ డాక్టర్ రవీంద్ర, వైస్ ప్రిన్సిపల్ ప్రసన్న రాజు, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ లక్ష్మయ్య, డాక్టర్ మురళిధర్ తదితరులు పాల్గొన్నారు.

## సుబ్బరామనాయుడు మృతి పార్టీకి తీరని లోటు

**ఎమ్మెల్యే పులివర్తి నాని**

**రామచంద్రాపురం, డిసెంబర్ 26, ప్రభాతవార్త**



తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు సుబ్బరామనాయుడు మృతి పార్టీకి తీరని లోటు అని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. గురువారం మిట్టూరులో సుబ్బరామనాయుడు మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం కందులవారిపల్లికి చేరుకొని సీనియర్ కార్యకర్త కందల ప్రసాద్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన కుటుంబ సభ్యులకు నేనున్నాని బరోస ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి, సీనియర్ నాయకుడు జనార్ధన్ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎస్వీయూలో అంతర్జాతీయ సదస్సు ప్రారంభం

తిరుపతి విద్య డిసెంబర్ 26 ప్రభాతవార్త:

ఎస్వీయూ బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో సెనెట్ హాల్ నందు శుక్రవారం బయోటెక్నాలజీ, మెడిసిన్ అండ్ క్యాన్సర్ తెరపాటిక్స్ అనే అంశంపై మూడు రోజులు పాటు జరిగే అంతర్జాతీయ సదస్సు ప్రారంభం కానున్నట్లు సదస్సు సంచాలకులు ప్రొఫెసర్ సరిత ఒక ప్రకటనలో తెలిపింది. అంతర్జాతీయ విద్యా సంస్థల నుంచి పలువురు ప్రతినిధులు సదస్సుకు హాజరవుతారని ఆమె తెలిపారు.

## బాలుర జూనియర్ కళాశాల కొత్త ప్రిన్సిపల్

**శ్రీకాళహస్తి,డిసెంబర్ 26 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తిలోని విద్యాప్రకాశానంద ప్రభుత్వ బాలురు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా గురువారం సుధాకర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాళహస్తిలోని ఏరియా ఆసుపత్రి సమీపంలో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసారు. ఇక్కడ పలు సమస్యలు చోటు చేసుకున్నాయి. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన సుధాకర్‌రెడ్డికి కళాశాల సిబ్బంది ఘనస్వాగతం పలికారు. ఆయన్ను సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో లెక్చరర్స్ రాష్ట్ర అసోసియేట్ అధనయక్షుడు వి.రవి, పుత్తూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గోపాల్‌రెడ్డి, చంద్రగిరి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ప్రకాష్, నాన్‌టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కందాటి విశ్వేర్‌రెడ్డి జూనియర్ లెక్చరర్స్ విజయసారధి, శ్రీహరిరెడ్డి, హరికృష్ణ, గిరిప్రసాద్‌లు ఉన్నారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన సుధాకర్‌రెడ్డికి ఇన్‌చార్జి ప్రిన్సిపల్‌గా బాధ్యతలు నిర్వహించిన వెంకటేశ్వర్లు బాధ్యతలు అప్పగించారు.

## శివయ్య సేవలో తమిళనాడు గవర్నర్

**శ్రీకాళహస్తి,డిసెంబర్ 26 ప్రభాతవార్త**



తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి కుటుంబసభ్యులతో స్వామిఅమ్మవార్లను గురువారం దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద వేద పండితులు వేదమంత్రాలతో మేళ తాళాలతో స్వాగతం పలికారు. ఆలయ ఇఒ టి.బాపిరెడ్డి ఆదేశాలతో డెప్యూటీ ఇఒ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, ఎఇఒ విద్యాసాగర్‌రెడ్డి, పిఆర్ఓ రవిలు స్వాగతం ఏర్పాటు చేసారు. కాగా ఆలయంలో దర్శనాలను ఆలయ ఇన్స్‌పెక్టర్ హరియాదవ్, ఎస్ఓ నాగభూషణం యాదవ్‌లు పర్యవేక్షించారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్న ఆయనకు మృత్యుంజయ స్వామి ఆలయం వద్దవేదపండితులతో ప్రత్యేక ఆశీర్వచనం ఏర్పాటు చేసారు.



## గొబ్బెమ్మ గ్రామోత్సవం:

**శ్రీకాళహస్తి,డిసెంబర్ 26 ప్రభాతవార్త**

ధనుర్మాసం శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారు గౌరమ్మగా గొబ్బెమ్మగా పుర ప్రజలకు ఉదయం దర్శనమివ్వటం ఆనవాయితి. ఈ నేపధ్యంలో గురువారం గౌరమ్మను ఆలయంలోని అలంకార మండపం చక్కగా అలంకరించి గ్రామోత్సవానికి తరలించారు. బోయిలు మోసుకుంటూ గ్రామోత్సవం సాగించారు. నాలుగుమాడావీధుల్లో ఇంటింటి ఎదురుగా అమ్మవారికి హారతులిచ్చారు. అమ్మవారిని చక్కగా పుష్పాలంకారం జరిపారు. చూడటానికి వెయ్యి కళ్ళు చాలవన్నట్లు తీర్చి దిద్దారు. గ్రామోత్సవంతో పాటు టెంపుల్ ఇన్స్‌పెక్టర్ హరిబాబుయాదవ్ దఫేదారులు, సిబ్బంది వెంటరాగా ఉత్సవం సాగింది.

## కరెంటు చార్జీల బాదుడుపై వైకాపా పోరుబాట

**శ్రీకాళహస్తి,డిసెంబర్ 26 ప్రభాతవార్త**



రాష్ట్ర ప్రభుత్వం విధానాలపై ప్రస్తుతం కరెంటు చార్జిల పెంచటంపై శుక్రవారం వైకాపా పోరుబాటను చేపట్టనున్నట్లు మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి గురువారం తెలిపారు. నిరుపేదల ప్రభుత్వం అంటూ గొప్పలు చెప్పుకుంటున్న నాయకుని పాలనలో సామాన్యుని జీవితం దుర్భరంగామారిందన్నారు. రైతులకు అరచేతిలో చూపిన స్వర్గం కలగానే మిగిలిందన్నారు. ప్రజల తరపున విద్యుత్‌చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఉదయం 9గంటలకు పోరుబాట నిర్వహించనున్నట్లు తెలిపారు. లక్ష్మీకామాక్షి కళ్యాణ మండపం నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు ర్యాలి నిర్వహిస్తామన్నారు. నియోజకవర్గ రైతులు, వైకాపా కార్యకర్తలు, నాయకులు, అభిమానులు హాజరై ప్రజల పక్షాన పోరాడాలని ఆయన పిలుపు నిచ్చారు.

## మూడు చోట్ల వంగవీటి వర్ధంతి

**శ్రీకాళహస్తి,డిసెంబర్ 26 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో కాపునాయకుడు వంగవీటి రంగా వర్ధంతిని మూడు చోట్ల గురువారం నిర్వహించారు. వైకాపా నాయకులు ఒక చోట, బిజెపి మరో చోట కాపుసామాజిక వర్గంలో ఓ వర్గం మరో చోట వర్ధంతిని జరిపి సామాజిక కార్యక్రమాలను నిర్వహించారు. ప్రభుత్వాసుపత్రి వద్ద ఏర్పాటు చేసిన వంగవీటి రంగా విగ్రహం వద్ద వైకాపా నాయకులు వర్ధంతి నిర్వహించగా బిజెపి నాయకులు పాత నెల్లూరుబస్టాండు వద్ద నిర్వహించారు. కాగా కార్గిల్ సర్కిల్ వద్ద ఓ వర్గం కాపు నాయకుడు నిర్వహించారు. పలు చోట్ల సామాజిక కార్యక్రమాలతో పాటు అన్నదానాలు జరిపారు.

## గుడిమల్లం ఆలయంలో డైరెక్టర్

**శ్రీకాళహస్తిరూరల్,డిసెంబర్ 26 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి నియోజకవర్గం లోని ఏర్పేడు మండలం గుడిమల్లంలో వెలసిన పురాతన, చారిత్రక ప్రసిద్ది చెందిన పరశురామేశ్వరాలయాన్ని గురువారం కేంద్ర డిఫెన్స్ డిఆర్‌డిఓ డైరెక్టర్ బి.వి.పాపారావు కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. వారికి ఆలయ తరపున చైర్మెన్ బత్తల గిరిబాబు, ఆలయ ఇఒ రామచంద్రారెడ్డి స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి వారిని దర్శించుకొన్నారు. వారికి ఆలయ చరిత్రను వివరించారు. పురావస్తుశాఖ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ఈ శైవాలయం దిన దినాభివృద్ది చెందుతుందని వివరించారు.

## మునిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన బియ్యపు

**శ్రీకాళహస్తిరూరల్,డిసెంబర్ 26 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామానికి చెందిన సీనియర్ వైకాపా నేత అమాస మునిరెడ్డి(75) మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని గురువారం మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి పరామర్శించారు. ఆయన కుమారుడు అమాస చంద్ర శేఖర్‌రెడ్డిని ఓదార్చారు. కుటుంబాన్ని పరామర్శిం చారు. ఆదుకోవటానికి నెనున్నానని భరోసా ఇచ్చారు. మునిరెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎంఎల్‌ఏతో పాటు నాయకులు కాపిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, దిలీప్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌కు డాక్టర్ సుబ్బలక్ష్మమ్మ సత్కారం

**తిరుపతి కలెక్టరేట్, డిసెంబరు 26 ప్రభాతవార్త ః**



రుయా ఆస్పత్రి సీఎస్ఆర్‌ఎంవోగా డాక్టర్ బి.సుబ్బలక్ష్మమ్మ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ డాక్టర్. ఎస్. వెంకటేశ్వర్‌ను ఆమె మర్యాద పూర్వకంగా కలిసి జిల్లా కలెక్టర్‌ను శాలువ పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించి అభినందించారు.

## బాలోత్సవం పిల్లల పండుగను విజయవంతం చేయండి

**తిరుపతి హెల్త్, డిసెంబరు 26 ప్రభాతవార్త ః**



స్థానిక నెహ్రూ మున్సిపల్ హైస్కూల్‌లో డిసెంబరు 28,29తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించే బాలోత్సవ పిల్లల పండుగనను విజయవంతం చేయాలని బాలోత్సవం వ్యవస్థాపక అధ్యక్షులు నాగార్జున, గౌరవ అధ్యక్షులు దామోధర్, ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు, బాలోత్సవం యోగా మాస్టర్ తహ సున్నీసా బేగం పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బాలోత్సవం పేరులో అన్ని రకాల క్రీడా కార్యక్రమాలు నిర్వహించి పోటీల్లో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. తహ సున్నీసా బేగం మాట్లాడుతూ నిత్య జీవితంలో పిల్లలు ఎన్నో మానసిక ఒత్తిళ్ళకు గురి అవుతున్నారని, యోగా అనేది వారి మానసికంగా, శారీరకంగా ఎంతో ఉపయోగపడుతుందని, వారి మేథస్సును పెంచుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవం ప్రతినిధి బృందం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## రేపు డిగ్రీ కాలేజీలో మెగా జాబ్ మేళా

**పుత్తూరు, డిసెంబరు 26 ప్రభాతవార్త :**

ఈ నెల 28వ తేదీన స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఉదయం 10 గంటలకు మెగా జాబ్ మేళా జరుగుతుందని కాలేజీ ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ వి.వీరయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఆర్ఎఫ్, విస్ట్రాన్, హీరో మోటార్ కార్పొరేషన్ లిమిటెడ్, అపోలో ఫార్మశీ, డైకన్ వంటి తొమ్మిది కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. పది, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, బిటెక్ చదివి 18 నుంచి 30 ఏళ్ల వయస్సు వున్న అభ్యర్థులు ఇంటర్వ్యూల్లో పాల్గొనవచ్చని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు సర్టిఫికెట్ల జెరాక్స్, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో కాలేజీలోని సెమినార్ హాలులో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని వివరించారు. ఇతర వివరాలకు ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బాబూరావు 9848553724, ప్లేస్‌మెంట్ ట్రైనర్ 6304330520 నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

# తిరుపతి డివిజన్

## విద్యార్థినికి ఆర్థిక సహాయం



**పాకాల, డిసెంబర్ 26, ప్రభాతవార్త**

పాకాల మండలం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల దామలచెరువులో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థిని తస్లీమ్‌కి అనారోగ్యం కారణాల వల్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యా కమిటీ, గ్రామ పెద్ద కె అహ్మద్ బాషా అందరూ కలిసి 10560 రూపాయలు ఆరోగ్య ఖర్చుల నిమిత్తమై విరాళాన్ని ప్రకటించి మండల విద్యాశాఖ అధికారి బాబ్జి చేతులమీదుగా విద్యార్థిని తల్లిదండ్రులకు ఇప్పించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విజయ మోహన్, రెడ్డెప్ప యు.టి.యఫ్ నాయకులు పత్తిపాటి రమేష్ నాయుడు ఉపాధ్యాయులు చిన్న స్వామి, లక్ష్మిదేవి, ప్రమీలమ్మ, సయ్యద్ ఖాజా యూసుఫ్, సి ఆర్ పి శ్రీనివాసులు విద్యార్థిని తల్లిదండ్రులు ఎస్ మస్తాన్, ఎస్ నస్రీన్ తదితరులు పాల్గొన్నారు.

## గాదంకిలో రెవెన్యూ సదస్సు

**పాకాల, డిసెంబర్ 26, ప్రభాతవార్త**



పాకాల మండలం గాదంకి పంచాయతీలో రెవెన్యూ సదస్సు కార్యక్రమం గురువారం తాసిల్దార్ నిత్యానంద బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఇరుగు గురుమూర్తి, స్థానిక సర్పంచ్, టిడిపి నేత రమేష్, ఎంపీటీసీ శ్యామల, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ రెవెన్యూ సదస్సు కార్యక్రమానికి తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్ విచ్చేసి ప్రజల నుండి స్వయంగా అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ రామ్మోహన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ స్థాయిలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. రెవెన్యూ, భూ సమస్యలను సులభతరంగా పరిష్కరించుకోవడానికి అనువైన వేదిక రెవెన్యూ సదస్సులు అని అన్నారు. ఈ కార్యక్రమంలోఅధికారులు, రెవెన్యూ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు గ్రామస్తులు, తదితరులు, పాల్గొన్నారు.

## 2039 వరకు టిడిపిదే అధికారం

**జనవరి 3న నారావారిపల్లిలో జాబ్‌మేళా, జూట్ బ్యాగ్స్ అల్లికపై ఉచిత శిక్షణ**

**ఎంఎల్ఏ పులివర్తి నాని**



**చంద్రగిరి, డిసెంబరు 26 ప్రభాతవార్త:**

ఆంధ్రప్రదేశ్‌లో 2039 వరకు తెలుగుదేశం పార్టీదే అధికారమని ఎంఎల్ఏ పులివర్తి నాని ధీమా వ్యక్తం చేశారు. మండల పరిధిలోని నారావారిపల్లిలో యూనియన్ బ్యాంక్ సహకారంతో మహిళలకు జూట్ బ్యాగ్స్ అల్లికపై ఉచిత శిక్షణ కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు ఏ.రంగంపేట నుండి భీమవరంకు వున్న గ్రామాలలో మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించే లక్ష్యంతో మొదటిసారి నారావారిపల్లిని ఫైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో మీరు తయారుచేసే జూట్ బ్యాగ్‌లకు గిట్టుబాటు ధరను కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. నారావారిపల్లి టిటిడి కల్యాణ మండపంలో జనవరి 3న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం డిపిఓ సుశీలాదేవి మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య యువతను తీవ్రంగా వేధిస్తుందన్నారు. విజనరీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారధ్యంలో 2047 నాటికి ప్రపంచంలోనే అగ్రగామిగా ఆంధ్రప్రదేశ్ వుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు విశేషంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు.

## భూ సమస్యల పరిష్కారానికి రైతు సదస్సులు

**తహశీల్దార్ శివసుబ్బరామయ్య**



**చంద్రగిరి, డిసెంబరు 26 ప్రభాతవార్త:**

భూ సమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సు లు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ శివసుబ్బరామయ్య తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయ ఆవరణలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములకు సంబంధించి ఏవైనా సమస్యలు వున్నట్లయితే అర్జీ రూపంలో తెలియజేస్తే పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఇందుకు తగిన అధారాలను అర్జీతో పాటు జతచేసి అందజేయాలన్నారు. ఆ మేరకు ప్రజల నుండి వచ్చిన వినతుల పరిశీలించి పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ విజయభాస్కర్, డిప్యూటీ తహశీల్దార్ దివాకర్, ఆర్ఐ భాస్కర్, రాయలపురం సర్పంచ్ వెంకటయ్య, మండల కోఆప్షన్ సభ్యుడు ఔరంగజేబు, టిడిపి నాయకులు రమేష్ రెడ్డి, గౌస్‌భాషా, అమ్ములు, గాయత్రి, విఆర్‌ఓలు సిద్దయ్య, విష్ణువర్ధన్, రెడ్డిప్రసాద్, పురుషోత్తం, విలేజ్ సర్వేయర్లు లలిత, గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.

## సిమెంటు రోడ్డు పనులను పరిశీలించిన డ్వామా పీడీ

**కెవిబీ పురం, డిసెంబరు 26 ప్రభాతవార్త:**

మండలంలోని తిమ్మ సముద్రంపంచాయతీలో శరవేగంగా జరుగుతున్న సిమెంటు రోడ్డు పనులను డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ మండల అధికారులతో కలసి పరిశీలించారు. తిమ్మ సముద్రం పంచాయతీలో స్థానిక టీడీపీ సర్పంచ్ దొరబాబునాయుడు గ్రామంలో శరవేగంగా సిమెంటు రోడ్డు పనులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పీడీతో పాటు ఎంపీడీవో రాధారాణి పంచాయతీరాజ్ ఏఈ పవన్‌కుమార్, ఏపీవో కుమారస్వామి ఉన్నారు. స్థానిక సర్పంచ్ పంచాయతీ అభివృద్ధికి శ్రీకారం చుట్టిన నేపథ్యంలో పంచాయతీలో తాగునీటి సమస్య తీర్చడం డ్రైనేజీ సమస్య తీర్చడం అదే విధంగా ప్రభుత్వం మంజూరు చేసిన సిమెంటు రోడ్లు శరవేగంగా జరుగుతుండడంతో సర్పంచ్‌ని అధికారులు అభినందించారు. కేవీబీ పురం మండలానికి ఇంచుమించు రెండు కోట్ల రూపాయలకు సంబంధించి 36 సిమెంటు రోడ్లు మంజూరైనట్లు ఎంపీడీవో తెలిపారు. మండలంలో ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు సిమెంటు రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు.

## ప్రతి విద్యార్థికి చదువే కీలకం : ఎమ్మెల్యే

**సత్యవేడు, డిసెంబరు 26 ప్రభాతవార్త:**



ప్రతి విద్యార్థి పోటీపడి చదువుకుంటే వారి జీవితంలో ఉన్నత స్థితికి చేరే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే ఆదిమూలం స్పష్టం చేశారు. గురువారం మండల పరిధిలోని మదనంబేడు జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయులు చినబాబు ఆధ్వర్యంలో ప్రజా కళావేదిక వ్యవస్థాపకులు ఆరవ జయపాల్ పర్యవేక్షణలో ప్రజా కళావేదిక కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు పరమశివం, వైస్ ఎంపీపీ సరోజని రాబర్ట్, మాజీ ఎంపీపీ మస్తాన్, పిచ్చాటూరు ఇళంగోవన్ హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యా రంగంలో గతంతో పోలిస్తే పెను మార్పులు రావడం జరిగిందన్నారు. తాము చదువుకున్న రోజుల్లో తరగతి గదులు లేకపోవడంతో చెట్ల కింద కూర్చునే విద్యాభ్యాసం పూర్తిచేసినట్టు ఆయన గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం కార్పొరేట్ విద్యా సంస్థలు తలదన్నేలా పిల్లలకు తరగతి గదులు కొరత లేకుండా నిర్మిస్తున్నామన్నారు. దీంతో పాటు ప్రభుత్వ సహకారంతో డిజిటల్ తరగతులు కూడా నిర్వహిస్తున్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఇందుకు తగ్గట్టు విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాన్ని ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. దీన్ని గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావును కేబినెట్ హోదాతో నియమించడం జరిగిందన్నారు. ప్రజా కళావేదిక వ్యవస్థాపకులు ఆరవ జయపాల్ మాట్లాడుతూ విద్యార్థుల్లో తెలుగు సాహిత్య అభిలాషను పెంచాలన్న ఉద్దేశంతో ప్రజా కళావేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం తెలుగు సాహిత్యంపై నెల క్రితమే నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ఎమ్మెల్యే నగదు బహుమతితతో పాటు మెమెంటో సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శివరంజని, వెంకటేశులు, బాబు, టీడీపీ నాయకులు శశిమోహన్‌నాయుడు, ప్రభాకర్‌రెడ్డి, మురళి(కోళ్ళ చిన్న), రమణ, షణ్ముగం, ధనశేఖర్, ఆనందన్, ఉపాధ్యాయులు భాస్కరన్, అమర్‌నాథ్‌రెడ్డి, పద్మావతి, గోపి, నాగరాజు, హిమ, స్వర్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

## సిమెంటు రోడ్డుకి ఎమ్మెల్యే భూమిపూజ

**సత్యవేడు, డిసెంబరు 26 ప్రభాతవార్త:**

సత్యవేడు మండలం మదనంబేడు గ్రామంలో సిమెంటు రోడ్డు నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే ఆదిమూలం భూమిపూజ చేశారు. గురువారం టీడీపీ మాజీ మండల అధ్యక్షులు పరమశివం, మాజీ ఎంపీపీ మస్తాన్‌తో కలసి భూమిపూజ చేయడం జరిగింది. గ్రామంలో స్వచ్ఛంద సంస్థ హస్వ సంక్షేమ వసతి గృహం ప్రవేశం వద్ద ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. తదనంతరం హాస్టల్ పిల్లలతో పలకరించి పదివేలు నగదును అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సరోజని రాబర్ట్, వెంకటేశ్వరులు, టీడీపీ నాయకులు రమణ, శశిమోహన్‌నాయుడు, ప్రభాకర్‌రెడ్డి, షణ్ముగం, మురళి(కోళ్ళ చిన్న), ధనశేఖర్, హస్వ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ అర్పుదరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## చెరువు నీటి సంఘ అధ్యక్షుడిని సన్మానిస్తున్న చినబాబు

**విజయపురం, డిసెంబరు 26 ప్రభాతవార్త:**



మండలంలోని కలియంబాకం చెరువు సాగునీటి సంఘ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన గాలి రమేష్ నాయుడుని గురువారం తెలుగుదేశం పార్టీ చిత్తూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చినబాబు శాలువ కప్పి అభినందించారు. ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని చెరువును అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు విజయకుమార్‌నాయుడు, రాంబాబు నాయుడు, పలువురు రైతులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## పోరుబాట కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరించిన మేరిగ



గూడూరు, డిసెంబర్ 26 ప్రభాతవార్త: గూడూరు పట్టణంలోని సనత్ నగర్‌లో ఉన్న వైయస్ఆర్సీపీ కార్యాలయం నందు పెంచిన విద్యుత్ ఛార్జీలకు నిరసనగా చేపట్టదలచిన పోరు బాట కార్యక్రమ పోస్టర్‌ను ఉమ్మడి నెల్లూరు జిల్లా స్థానికసంస్థల ఎమ్మెల్సీ, గూడూరు నియోజకవర్గ ఇంఛార్జ్ మేరిగ మురళీధర్, పార్టీ నాయకులు ఆవిష్కరించారు. మేరిగ మురళీధర్ మాట్లాడుతూ ఈ నెల 27వ తేది స్థానిక కూరగాయల మార్కెట్ (డిఎస్ఆర్ కమ్యునిటీ హాలు) పక్కన ఉన్న కరెంట్ ఏఈ ఆఫీస్ నందు ధర్నా, కరెంటు ఛార్జీల తగ్గింపునకు సంబంధిత అధికారికి వినతిపత్రం ఇవ్వడం జరుగుతుం దన్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సామాన్య ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయవలసినదిగా కోరుతున్నారు.

## నేడు విద్యుత్ ఛార్జీలు పెంచడంపై వైసీపీ ర్యాలీ

నాయుడుపేట రూరల్, డిసెంబర్ 26 ప్రభాతవార్త: సూళ్లూరుపేట నియోజక వర్గంలోని నాయుడుపేట, సూళ్లూరుపేట మున్సిపాలిటీల పరిధిలో విద్యుత్ ఛార్జీల పెంపుపై శుక్రవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ర్యాలీ నిర్వహించనుంది. విద్యుత్ ఛార్జీలు పెంచడంపై వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైసీపీ నాయకులు కటకం జయరామయ్య, పేట చంద్రారెడ్డిలు తెలిపారు. నాయుడుపేట పాత బస్టాండులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం నుంచి విద్యుత్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించి అధికారులకు వినతిపత్రాన్ని అందించనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

## కొత్తపట్నంలో రెవెన్యూ సదస్సు



కోట, డిసెంబర్ 26 ప్రభాతవార్త: కోట మండలం కొత్తపట్నంలో గురువారం తహశీల్దార్ జయ జయరావు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహిం చారు. ఈ సందర్భంగా తహశీల్దార్ జయజయరావు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం డిసెంబర్ 6 నుంచి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు మంచి స్పందన లభిస్తుందన్నారు. రెవెన్యూ సదస్సులలో రెవెన్యూ, భూ సమస్యలను సులభతరంగా పరిష్కరించుకోవడానికి అనువైన వేదికగా పేర్కొన్నారు. ఈ రెవెన్యూ సదస్సులు చిన్న, సన్నకారు రైతులకు ఎంతో ఉపయోగకరమని చెప్పారు. రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన దరఖాస్తులను 45 రోజుల్లో పరిశీ లించి పరిష్కారమార్గం చూపుతామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ అజ్మతుల్లాఖాన్, మండల సర్వేయర్ గోపిరెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణా అరికడతాం

నాయుడుపేట రూరల్, డిసెంబర్ 26 ప్రభాతవార్త: నాయుడుపేట మండల పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ ఇసుక రవాణా అరికట్టేందుకు ఆయా శాఖల సమన్వయంతో చర్యలు చేపడతామని తహశీల్దార్ మాగర్ల రాజేంద్ర గురువారం తెలిపారు. మూర్తిరెడ్డిపాలెం, అయ్యప్పరెడ్డిపాలెం తదితర ప్రాంతాల్లో స్వర్ణముఖి నది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని, గోతులు లోడినప్పటికీ కొంతమంది దొంగ మార్గాల నుంచి ఇసుక తరలిస్తున్నారని సమాచారం వస్తుందని తెలిపారు. ఈ మేరకు పోలీసుశాఖ, ఇరిగేషన్, రెవెన్యూ తదితర శాఖల సమన్వయంతో పూర్తిగా అక్రమ ఇసుక రవాణా అరికట్టేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో తలారులను కాపలాగా ఉంచి ఇసుక అక్రమ రవాణా జరిగితే తెలపాలని సూచించామని తహశీల్దార్ రాజేంద్ర తెలిపారు. ఇదిలావుంటే భీమవరం, అయ్యపరెడ్డిపాలెం, మూర్తిరెడ్డిపాలెంతో పాటు పెళ్లకూరు మండలం తాళ్వాయిపాడు తదితర ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగానే కొనసాగుతోంది.

## కొండూరులో రెవెన్యూ సదస్సు విజయవంతం

తడ, డిసెంబర్ 26 ప్రభాతవార్త: తడ మండలం కొండూరు పంచాయతీకి సంబంధించి సుందరపురం వద్ద ఉన్న సచివాలయంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కొండూరుతో పాటు పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన రైతులు పాల్గొని తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేశారు. కేవలం రెవెన్యూ అధికారులు మాత్రమే కాకుండా వివిధ శాఖల అధికారులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## ఒక్క రోజు ముందే పింఛన్లు పంపిణీకి రంగం సిద్ధం

కోట, డిసెంబర్ 26 ప్రభాతవార్త: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పథకంలో లబ్ధిదారులకు ఈ నెల 31న ఇంటింటికి వెళ్లి సిబ్బంది సొమ్ములను ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. వచ్చే ఏడాది జనవరి 1న నూతన ఆంగ్ల సంవత్సరం తొలి రోజు కావడంతో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సిబ్బందిపై పని ఒత్తిడి లేకుండా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ (స్పెర్) జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులకు ముందస్తుగా సంకేతాలు అందాయి. ఈ నెల 30న ఆయా ప్రాంతాల్లోని బ్యాంకులకు కార్యదర్శులు, సంక్షేమ సహాయకులు వెళ్లి నగదు తీసుకొని సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బందికి ఇవ్వాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. కోట మండలంలో 7వేల మంది లబ్ధిదారులకు 2 కోట్ల 93 లక్షల రూపాయలు పంపిణీ చేయనున్నట్లు ఎంపిడిఓ వేణు తెలిపారు.

## పేటలో నాశిరకంగా సిమెంటురోడ్లు నిర్మాణ పనులు



నాయుడుపేట డిసంబరు 26 ప్రభాతవార్త :రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పల్లెలను పట్టణాలకు ధీటుగా అభివృద్ధి చేయాలన్నా దృడ సంకల్పంతో పనిచేస్తుంటే సూళూరుపేట నియోజ కవర్గంలో పంచాయితీరాజ్ అధికారుల పర్యవేక్షణ లోపం, నిర్లక్ష్యంకారణంగా ప్రభుత్వ ఆశయాలకు తూట్లు పడుతున్నాయి. ఈ క్రమంలో నాయుడు పేట మండలంలోని అత్తిమిట్టకండ్రిగ, అరవ పెరిమిడి గ్రామాల్లో సుమారు 20లక్షలతో సిమెంటురోడ్లు నిర్మాణ పనులు చేపట్టారు. పనులు దక్కించుకున్న గుత్తేదారులు సిమెంటురోడ్డు నిర్మాణంలో నాశిరం మెటీరియల్ వాడటం వల్లన రోడ్లువేసిన కొద్దిరోజులకే పగుళ్ళిచ్చి పెచ్చులూడుతూ అధ్వానంగా మారుతున్నాయి.సిమెంటురోడ్లు నిర్మాణ పనులు చేపట్టేటప్పుడు అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గుత్తేదారులు ఇష్టారాజ్యంగా నాశిరకం మెటీరియల్ వాడటం వల్లన రోడ్లురూపాన్ని కోల్పోతున్నాయి. సిమెంటురోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించకుండ పనులు చేపడుతు న్నారని స్థానికులు అధికారులకు పిర్యాదుచేసిన వారు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి నాశిరకంగా చేపట్టిన సిమెంటురోడ్లు నిర్మాణ పనులపై పూర్తిస్థాయిలో క్వాంటీకంట్రోల్ వారితో మెజర్‌మెంట్ చేయించాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

## ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు : తహసిల్దార్

నాయుడుపేట టౌన్ నవంబరు 26 ప్రభాతవార్త : నాయుడుపేట మండలంలో ఎవరైన ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని నాయుడుపేట తహసిల్దార్ రాజేంద్ర తెలియజేశారు. తహసిల్దార్ మాట్లడుతూ నాయుడుపేట మండలంలోని మూర్తిరెడ్డి పాళెం, అయ్యప్పరెడ్డిపాళెం,కల్లిపేడు, మర్లపల్లి గ్రామాలకు చెందిన కొంతమంది అక్రమార్కులు స్వర్ణముఖి నది పొర్లుకట్టలు తొలగించి ఇసుక మాపియాకు పాల్పడుతున్నట్లు పిర్యాదులు వస్తున్నయని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మెరకు ఇసుకను నిత్యవసరాలాకు మాత్రమే వాడుకోవాల్సి వుండగా కొంతమంది అక్రమార్కులు ఇసుక మాపియాకు పాల్పడుతున్నరని తెలిపారు.ఇసుక మాపియాను అరికట్టేందుకు రెవెన్యూ,పోలీసులు కలిసి పొర్లుకట్టల వద్ద జెసిబిలతో గాడితీసి అడ్డుకట్టవేయడం జరిగిందన్నారు.

## ఘనంగా సిపిఐ పార్టీ శత జయంతి ఉత్సవాల వేడుకలు



గూడూరు, డిసెంబర్ 26 ప్రభాతవార్త: దేశానికి సంపూర్ణ స్వరాజ్యం నినాదంతో సిపిఐ పార్టీ ఆవిర్భవిం చిందని నేటి నుండి పార్టీ శత జయంతి ఉత్సవాలు పండుగ వాతావరణంలో జరుగుతున్నా యని గూడూరు సిపిఐ నాయకులు ప్రభాకర్ వెల్లడించారు. సిపిఐ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గూడూరు పట్టణంలోని పార్టీ కార్యాల యం వద్ద మరియు పాత బస్టాండ్ వద్ద పార్టీ జెండాను నాయకులు ఎగురవేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ మాట్లాడుతూ సంపూర్ణ స్వతంత్ర నినాదంతో 1925వ సంవత్సరం డిసెంబర్ 26 పార్టీ ఆవిర్భవించిందని ఈ 100 సంవత్సరాల్లో ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. నేటి పాలకులు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నారని వాటిపై కమ్యూనిస్టు పార్టీ పోరాటం చేస్తుందని ప్రజలందరి మద్దతు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాలేష, చంద్రయ్య, శశి, నారాయణ , రమేష్, మస్తాన్ , రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరం

గూడూరు, డిసెంబర్ 26 ప్రభాతవార్త: విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ఎంతో అవసరమని క్రీడల వల్ల మానసిక శారీరక ఉల్లాసం పెరుగుతుందని టెన్నీ కాయిట్ అసోసియేషన్ అధ్యక్షులు శ్యామ్ యాదవ్ వెల్లడించారు టెన్నీ కాయిట్ రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపికను గూడూరులో నిర్వహించారు అసోసియేషన్ అధ్యక్షులు పాల్గొన్నారు. గూడూరు పట్టణంలోని దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాలలో టెన్నీ కాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు అసోసియేషన్ అధ్యక్షులు శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ ఇక్కడ జరుగుతున్న పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని జనవరి నెలలో పలాసలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. క్రీడలు ఆడడం వల్ల శారీరిక ధృడత్వం పెరుగుతుందని అలాగే క్రీడాకారుల కోటాలో ఉద్యోగ అవకాశాలు కూడా ఉన్నాయని వెల్లడించారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులు అక్కడ కూడా మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి గుర్తింపు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోటేశ్వరరావు, భాస్కర్,హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

## సమ్మె కాలపు వేతనాలు పెంచాలి



గూడూరు, డిసెంబర్ 26 ప్రభాతవార్త: సమ్మె కాలపు ఒప్పందాలు, ఇంజనీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని ఏపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ డిమాండ్ చేశారు. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు పట్టణ కార్యదర్శి కోటేశ్వర రావు మాట్లాడు తూ సాధారణంగా మరణించిన లేదా ప్రమాదంలో మరణించిన మున్సిపల్ కార్మికునికి ఎక్స్‌గ్రేసియే ఇవ్వాలన్నారు. మున్సిపల్ కార్మికులు మరణించిన వారి కుటుంబంలో ఒకరికి పని ఇవ్వాలన్నారు. ఎన్ఎంఆర్ కార్మికునికి, ఇంజనీరింగ్ కార్మికులకు, క్యాబ్ డ్రైవర్స్‌కి, బదిలి కార్మికునికి, పార్కులో పనిచేస్తున్న కార్మికులకు జిఓఎం ఎస్‌నెం 36 వర్తింపచేయాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. కమీషనర్ పరిశీలించి ఉన్నత అధికారుల దృష్టికి తీసుకుపోవాలని తెలిపారు. లేని యెడల మున్సిపల్ కార్మికులందరు కలిసి నిరసన కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పి. పెంచల ప్రసాద్, గౌరవ అధ్యక్షులు ఎస్. సురేష్, కార్యదర్శి బివి రమణయ్య, అధ్యక్షులు బివి రమణయ్య, మణి, భవన నిర్మాణ శాఖ అధ్యక్షులు శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## హైందవ శంఖారావం సభను విజయవంతం చేయండి

**- విశ్వహింధూ పరిషత్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ**

**- విశ్వ హిందు పరిషత్ అధ్యక్షులు ఎం. మురళీరెడ్డి**



గూడూరు, డిసెంబర్ 26 ప్రభాతవార్త : హైందవ శంఖారావం సభను విజయవంతం చేయాలని విశ్వ హిందు పరిషత్ అధ్యక్షులు ఎం. మురళీరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం గూడూరు పట్టణంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో వివిధ క్షేత్రాల కలియికతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాలలో అన్యమతస్తులను తొలగించాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కూడా హిందువు లేవుండాలని, దేవాల య ట్రస్ట్ బోర్డులలో రాజకీయ ప్రమేయం లేని హిందూ భక్తులు మాత్రమే సభ్యులుగా వుండాలని, దేవాలయ సముదాయ దుకాణాలను హిందువులకు మాత్రమే కేటాయించాలని, దేవాలయాల భూములను అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. హిందూ దేవాలయాల మీద జరుగుచున్న దాడులను ఖండిస్తూ ప్రభుత్వాలు గుర్తించి భాద్యులపైన కఠిన శిక్షలు విధిం చాలని, దేవాలయాల మీద వచ్చే ఆదాయం కేవలం హిందు ధర్మ ప్రచారానికి మాత్రమే వినియోగించాలని కోరారు. జనవరి 5వ తేది విజయవాడలో జరుగుతున్న హైందవ శంఖారావానికి హిందువులందరూ కదలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ వెంకటరమణయ్య, రవిచంద్ర, రామయ్య, సత్యానందస్వామి, సనత్ కుమార్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, బిజేపీ పట్టణ అధ్యక్షులు బాలయ్య నాయుడు, ప్రకాష్ నాయుడు, దయాకర్, ప్రవీణ్, గిద్దలూరు మనోజ్, మన్నూరు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## బిజికెపాలెంలో అందరూ భూదొంగలే

**- కొందరినే టార్గెట్ చేస్తున్న రెవెన్యూ అధికారులు**



చిట్టమూరు, డిసెంబర్ 26 ప్రభాతవార్త : చిట్టమూరు మండలం లోని తీరప్రాంత పంచాయతీ అయిన బురదగాలి కొత్తపాలెంలో అందరూ భూ ఆక్రమణదారులు అయినప్పటికీ కొందరు నిరుపేదలను మాత్రమే అధికారులు టార్గెట్ చేస్తూ ఇబ్బందులు పెడుతుండటం పట్ల పలు విమర్శలు వ్యక్తమవు తున్నాయి. దీనికితోడు ప్రతిపక్ష వైసీపీ నేతలు కొందరు సొంత పార్టీలోని కొందరు పేదలు సాగుచేసుకుంటున్న భూములపై కన్నేసి అధికారులతో కలిసి ఆడుతున్న డ్రామాలు చూస్తున్న గ్రామప్రజలు తీవ్రంగా మండిపడుతున్నారు. గ్రామ పంచాయతీలో విస్తారంగా అటవీ భూములతో పాటు మేత, గుంటపోరంబోకు భూములు మూడు వేల ఎకరాలకు పైగా ఉన్నాయి. ఇప్పటికే పంచాయతీ పరిధిలోని కొత్తపాలెం, బురదగాలి, కుమ్మరిపాలెం, పేరపాటితిప్ప తదితర గ్రామాలకు చెందిన భూస్వాములు, పెద్ద రైతులు యథేచ్ఛగా ప్రభుత్వ భూములు ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్నారు. గ్రామంలోని రెడ్డి కులానికి చెందిన సెంటు భూమిలేని ఓ నిరుపేద గత 20 సంవత్సరాల కాలంగా ఉప్పుటేరులోని 3 ఎకరాల 50 సెంట్లు పొలాన్ని తీర్చి వరి సాగు చేసుకుంటూ కుటుంబాన్ని వెళ్లదీస్తున్నాడు. దీనిపై గతంలో తహశీల్దార్ ఎలాంటి విచారణ జరపకుండానే అతనిపై అక్రమ కేసులు బనాయించి తదుపరి ఈ భూములు రెవెన్యూ పరిధిలోకి రావని తెలుసుకుని తేల్చారు. ప్రస్తుతం అదే తహశీల్దార్ మళ్లీ గ్రామ రెవెన్యూ అధికారిపై ఒత్తిడి తెస్తూ ఆ నిరుపేద వరి నాట్లు వేసిన పొలాన్ని ధ్వంసం చేయాలని ఒత్తిడి తేవడం వెనుక సొంత పార్టీ నేతల హస్తం ఉందన్నది గ్రామస్థుల వాదనగా వినిపిస్తోంది. దీంతో గురువారం సర్వేయర్ సురేష్, విఆర్ఓ కోటయ్య మరోమారు ఆక్రమిత భూమిని పరిశీలించి అది అటవీ భూమిగా గుర్తించారు. రెవెన్యూ అధికారులు భూస్వాములకు ఒకరకంగా, గ్రామంలో సెంటు భూమిలేని పేదలపై మరో రకంగా వ్యవహరిస్తున్న తీరుతో గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తుండటంతో పంచాయతీలో గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇకనైనా అధికారులు తమ తీరు మార్చుకొని ఆక్రమణదారులు అందరికీ ఒకే చట్టం వర్తించేలా ముందుకు సాగాలని కోరుతున్నారు.

## జల్లికట్టు సంబరాలతో తీవ్ర ఇబ్బందులు

**జల్లికట్టు ఊరుబయట జరుపుకోమనండి..! కలెక్టర్, ఎస్పీలకు గ్రామస్థుల వినతి**



చంద్రగిరి, డిసెంబర్ 26 ప్రభాతవార్త : జల్లికట్టు సంబరాల కారణంగా గ్రామంలో మహిళలు, పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు కొత్త శానంబట్ల గ్రామస్థులు గురువారం జిల్లా కలెక్టర్‌కు, ఎస్పీకి వినతిపత్రం అందజేశారు. జనవరి 1న నూతన ఆంగ్ల స వత్సరాధి రోజున కొత్త శానంబట్లలో నిర్వహి చే జల్లికట్టు సంబరాల ఎద్ల పందేరాలలో ప్రాణాలు కోల్పోతున్న వారు కొందరైతే, తీవ్రగాయాలపాలైన వారు అనేక మంది వున్నా రు. ఇదిలా వుండగా పశవుల పండుగ కోసం వీధులను ఎర్రమట్టితో నింపేయడం, గ్రామంలో బయటి ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో పశువులను తీసుకురావడం వలన మా నివాసాల వద్ద రొచ్చురొచ్చుగా మార్చేస్తున్నట్లు వాపోయారు. ముఖ్యంగా మందుబాబులు మద్యం సేవించి, ఆ బాటిళ్ళ ధ్వంసం చేయడం, కైపులో తమ ఇళ్ళముందు వాంతులు చేసుకుని పడిపోవడం వంటి ఘటనలు జరిగినట్లు గుర్తు చేశారు. జల్లికట్టు కారణంగా తమకు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతున్నట్లు తెలిపారు. ప్రతిఏటా ప్రశ్నించిన వారిపై ధౌర్జన్యాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ఇకపై ఉత్సవాల సమయంలో ఊరేగింపులను మీ ఇళ్ళకు రానివ్వమని హెచ్చరిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం జల్లికట్టు సంబరాలను ఊరు బయట నిర్వహించుకోవాల్సిందిగా కోరితే తమకు బెదిరింపులు ఎదురవుతున్నట్లు తెలిపారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన సిసి రోడ్లు జల్లికట్టు వలన ధ్వంసమయ్యే పరిస్థితి వున్నందున ప్రజల ఇబ్బందుల దృష్ట్యా సంబరాలను ఊరు బయట జరుపుకునే విధంగా చూడాలని కోరారు.

## హెల్మెట్లు ధరించండి: ప్రాణాలు కాపాడుకోండి



శ్రీకాళహస్తి,డిసెంబర్ 26 ప్రభాతవార్త :హెల్మెట్లు ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని పోలీసులు, రాజకీయ నాయకులు పిలుపు నిచ్చారు. గురువారం శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో భారీ ఎత్తున అవగాహన ర్యాలి నిర్వహించారు. ద స్కూల్ అవరణలో సమావేశం ఏర్పాటు చేసారు. స్థానిక డివైయస్‌పి కె.నరసింహామూర్తి పర్యవేక్షణలో పోలీసులు నిర్వహించారు. ర్యాలి ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిధులుగా బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్, ద స్కూల్ కరస్పాండెంట్ జనార్ధన్‌రావు పవార్ హాజరయ్యారు. ఈ సందర్బంగా ర్యాలిలో పాల్గొన్న వేలాది మంది విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్బంగా డివైయస్‌పి నరసింహామూర్తి మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలు పాటించటంపై అవగాహన కల్పించుటకు ర్యాలి ఏర్పాటు చేసామని వివరించారు. ముఖ్యఅతిధిగా హాజరైన కోలా ఆనంద్‌కుమార్ పోలీసుల చొరవను అభినందించారు. పచ్చజెండా ఊపి ర్యాలిని ప్రారంభించటమే కాకుండా సుమారు మూడు గంటల పాటు జరిగిన ర్యాలిలో పాల్గొన్నారు. సిఐలకు హెల్మెట్లను డివైయస్‌పి నరసింహామూర్తి, కోలా ఆనంద్‌కుమార్‌లు అందించారు. సిఐలు రవినాయక్, తిమయ్య, గోపి,వెంకటేశ్వర్లు,ఎస్ఐలు సుధాకర్‌రెడ్డి, విశ్వనాధం నాయుడు, బిజెపి నాయకులు సుబ్రమణ్యం రెడ్డి, గరికపాటి రమేష్‌బాబు, ఎస్వి రమణ,సజ్జల హరీష్, ఆర్.హరీష్‌రెడ్డి, భరత్‌కుమార్‌నాయుడు, జ్ఞానగారి పోలయ్య, మురళీకృష్ణారెడ్డి, రవి,రమణయ్య,సుధాకర్, కటికం చెందురాయల్, రవి రాయల్, నాని సిద్దూ, బిదుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎల్‌ఏ మంచోడు..పక్కవాళ్ళతోనే ఇబ్బంది

**- ఉన్నం వాసుదేవనాయుడు**



తొట్టంబేడు, డిసెంబర్ 26 ప్రభాతవార్త : ఎంఎల్‌ఏ బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి ఎంతో మంచివారని ఆయన పక్కన ఉన్న వారితోనే ఇబ్బంది అని మండల వైకాపా కన్వీనర్ ఉన్నంవాసుదేవనాయుడు తెలిపారు. గురువారం వైకాపా పార్టీ కార్యాలయంలో మండల వైకాపా సీనియర్ నాయకులు, కన్వీనర్ ఉన్నంవాసుదేవనాయుడు ఆధ్వర్యంలో బోనుపల్లి గ్రామస్తులతో కలసి పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. మండల వైకాపా సీనియర్ నాయకులు ఉన్నం వాసుదేవనాయుడు మాట్లాడుతూ ఎంఎల్‌ఏ బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి ఎక్కడ కూడా ఎవ్వరిని ఇబ్బందులకు గురిచేయవద్దని చెప్పారని, అయితే పాలసరఫరా మాజీ ఛైర్మన్ రావిళ్ళమునిరాజనాయుడు ఇటీవల నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో నాయకులను ఏకవచనంతో సంబోధిస్తూ మాట్లాడడం, గ్రామాల్లో సంఘమిత్ర, ఫీల్డ్ అసిస్టెంట్, చిన్నపాటి ఉద్యోగులను మార్చివేయాలంటూ అధికారులను ఆదేశిస్తున్నారని, దీంతో కళ్ళిపూడిలో ఓ మహిళ ఆత్మహత్యయత్నంకు పాల్పడిందని వివరించారు. సమావేశంలో మృతుడు ముని సుబ్రమణ్యం తల్లి ఆదెమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు. పచ్చని పల్లెల్లో చిచ్చులు పెట్టవద్దని మునిరాజనాయుడుకు హితవు పలికారు. తమ ప్రభుత్వంలోనే తమను మునిరాజనాయుడు అడుక్కుంటే చిన్నసింగమాల పంచాయతీ సర్పంచ్ తెదేపాకు ఇచ్చామన్నది గుర్తించుకోవాలన్నారు. బోనుపల్లి గ్రామంలో ఈనెల 12వ తేదీన రెవెన్యూ సదస్సును స్థానిక శాసనసభ్యులు బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి, అధికారులు ఆధ్వర్యంలో నిర్వహించారు.మాజీ ఎంపిపి కోవిచంద్రయ్యానాయుడు మాట్లాడుతూ బోనుపల్లిలో ఎన్నడూ కేసులు లేవని ఒకవేళ కేసులు పెడితే తాము వెళ్ళి రాజీచేసిన సంఘటనలు ఉన్నాయన్నారు. ఈసదస్సులో ఇరువర్గాల మధ్య వివాదాలు చోటుచేసుకున్న విషయం విదితమే. ఈనేపధ్యంలో మృతుని తమ్ముడు జలగంఆనంద్ మాట్లాడుతూ గ్రామంలో నివాసం ఉంటున్న ఆదెమ్మ,కుమారుడు ముని సుబ్రమణ్యంలు కలసి రెవెన్యూ సదస్సులో వినతిపత్రాన్ని సమర్పించారు.దీంతో ఎంఎల్‌ఏ సిఐ తిమ్మయ్యకు అప్పగించి సామరస్యంగా న్యాయపరంగా పరిష్కరించమని తెలిపారని అయితే గ్రామానికి చెందిన రామానాయుడు అనే వ్యక్తి ఎంఎల్‌ఏ వెళ్ళిన తర్వాత తన ఇంటి వద్దకు వచ్చి పదిమందితో కలసి తనను అసభ్యకర పదజాలంతో దూషిస్తూ ఎంఎల్‌ఏకు వినతిపత్రం ఎందుకు ఇచ్చావంటూ తనపై చేయిచేసుకున్నారన్నారు. దీనిపై తాను పోలీసులకు పిర్యాదుచేయగా వారు తన అన్న మునిసుబ్రమణ్యం, తన తల్లి ఆదెమ్మను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్ళారని ఆవేదన వ్యక్తంచేశారు. తన అన్న మునిసుబ్రమణ్యం, తల్లి ఆదెమ్మలను రాత్రి 11గంటల వరకు ఉంచి గ్రామానికి వెళ్ళరాదని తెలిపారని ఈసంఘటనలన్నీ ఈనెల 19వ తేదీ వరకు జరిగాయని ఈనెల 20వ తేదీన తన అన్న మునిసుబ్రమణ్యం రామానాయుడు ఇంటి ముందు నుంచి వెళ్తుండగా తన అన్నను బెదిరిస్తూ వెంబడించగా భయపడి వేదించి తన అన్న మృతికి కారణమయ్యారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము 21వ తేదీన పోలీసులకు పిర్యాదుచేశామన్నారు. తన అన్న మృతికి సంబంధించి పోస్టుమార్టం నివేదికను కూడా మార్చివేస్తారన్న అనుమానం తనకు ఉందని తమ్ముడు ఆనంద్‌తెలిపాడు. మాజీ ఎంపిపి కోవిచంద్రయ్య నాయుడు, బోనుపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

## పదిరోజులు భక్తుల వాహనాలకు సక్రమ పార్కింగ్

**- భద్రతకు అంకిత భావసేలు -తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు**

తిరుమల,డిసెంబర్ 26ప్రభాతవార్తప్రతినిధి: జనవరి 10నుండి 19వతేదీ వరకు పదిరోజులు వైకుంఠద్వార దర్శనాలకు వచ్చే భక్తుల వాహనాలను నిర్దేశిత పార్కింగ్ ప్రాంతాల్లో పార్కుచేసేలా చూడాలని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆదేశించారు. పెద్దసంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో రద్దీ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ,విజిలెన్స్ సెక్యూరిటీ విభాగంతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. భక్తులకు సురక్షితమైన ,ఆనందకరమైన స్వామివారి దర్శనం కలిగేలా చూడటంలో పోలీసుల పాత్ర కీలకమన్నారు. భక్తుల భద్రత, క్యూలైన్ల నిర్వహణ, అదనపు పార్కింగ్ సదుపాయాలపై గురువారం ఉదయం తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, డిఎస్పీ కె.విజయశేఖర్, సిఐలు విజయ కుమార్, శ్రీరాముడు, హరిప్రసాద్,విజిలెన్స్ అధికారులతో కలసి ఎస్పీ సుబ్బరాయుడు అనేక ప్రాంతాలను తనిఖీ చేశారు.

## శ్రీసిటీని సందర్శించిన డీపీఐఐటీ కార్యదర్శి



శ్రీసిటీ, డిసెంబరు 26 ప్రభాతవార్త: కేంద్ర వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వశాఖకు చెందిన పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం(డీపీఐఐటీ) కార్యదర్శి అమర్‌దీప్ సింగ్ భాటియా, శ్రీసిటీ ప్రెసిడెంట్(ఆపరేషన్స్) సతీష్ కామత్ ఆయనకు సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. ప్రముఖ ఆటోమేటివ్, ఎయిర్ కండీషనర్ బ్రాండ్ల ఉనికి, బలమైన సరఫరా గొలుసుతో దేశంలో అగ్రగామి కేంద్రంగా శ్రీసిటీ వేగంగా ఎదుగుతోందని చెప్పారు. పారిశ్రామిక వాడలో పర్యటించిన ఆయన డైకిన్ ఏసీ తయారీ పరిశ్రమను సందర్శించి అక్కడి తయారీ కార్యకలాపాలను పరిశీలించారు. శ్రీసిటీలో ఏసీ కంప్రెసర్ల తయారీ యూనిట్ ఏర్పాటు కోసం డైకిన్ ఇండియా, తైవాన్‌కు చెందిన రెచి సంస్థ భాగస్వామ్యంపై స్పందిస్తూ, కీలకమైన విడి భాగాల కోసం భారతదేశం దిగుమతులపై ఆధారపడటాన్ని గణనీయంగా తగ్గించ చర్యగా దానిని పేర్కొన్నారు. శ్రీసిటీ అద్భుత పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, వ్యాపార అనుకూల వాతావరణాన్ని అమర్‌దీప్ సింగ్ ప్రశంసించారు. ఆత్మనిర్భర్ భారత్ చొరవకు శ్రీసిటీ ఒక చక్కని ఉదాహరణగా అభివర్ణించారు. అమర్‌దీప్ సింగ్ పర్యటన తమకు ఎంతో ముఖ్యమైందంటూ తన సందేశంలో పేర్కొన్న శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ఆయన పరిశీలనలు, సూచనలు, శ్రీసిటీ అభివృద్ధికి దోహదం చేస్తాయని తెలిపారు.

## జిల్లాలో పశుగణన ప్రక్రియను వేగవంతం చేయాలి

**- కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్**



తిరుపతి కలెక్టరేట్, డిసెంబరు 26 ప్రభాతవార్త : జిల్లాలో పశుసంరక్షనే ధ్యేయంగా పశు సంపద సమగ్ర సమాచారాన్ని తెసుకునేందుకు పశు గణన ప్రక్రియను చేపట్టడం జరిగిందని, వెంటనే వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు పశు సంవర్ధక శాఖ అధికారులు, పశు వైద్యాధికారులు ప్రాంతీయ పశు వైద్యశాలల సహాయ సంచాలకులతో జిల్లా కలెక్టర్ పశువర్ధక శాఖ ద్వారా అమలు అవుతున్న వివిధ పథకాల అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పాడి రైతులకు పశు కిసాన్ క్రెడిట్ కార్డుల మంజూరు కోసం జిల్లా లీడ్ బ్యాంకు మేనేజరుతో వారితో కలిసి లక్ష్య సాదన చేయాలని సూచించారు. జిల్లాలోని ప్రతి పాడి పశువు నుంచి మెరుగైన పాల ఉత్పత్తికి అవసరమైన అన్ని చర్యలతో పాటు దిగుబడును పెంచే దిశగా సహాయ సంచాలకులు దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవికుమార్, తిరుపతి డివిజన్ ఉప సంచాలకులు ఉమా మహేశ్వరి, జిల్లా నందలి పశు సంవర్ధక శాఖ అధికారులు పశు వైద్య సహాయ శస్త్ర చికిత్సకులు, తదితరులు పాల్గొన్నారు.


**IN THE COURT OF THE PRL. CIVIL JUDGE(SENIOR DIVISION), CHITTOOR**

**I.A.No. 189 of 2024**
**O.S.No. 127 of 2017**

Between:
**P.Thej Kumar** ..Petitioner/ Plaintiff
And
**P.Jayachandra Reddy & others**
...Respondents/Defendants

**NOTICE TO RESPONDENTS**
**21, 25 TO 28 & 40**

**21. M.V.G. Prasad,** M/o P.Jamuna, S/o. Late M.Bhaskar Reddy, r/at D.No.1-28-A, 155 Kammapalli and Post, Yadamari Mandal, Chittoor Dist.
**25. P.Neelamma,** W/o. Late Sankar Reddy,
**26. P. Prabhakar Reddy,** S/o. Late Pakala Sankar Reddy,
**27. P.Haritha,** D/o. Late P.Sankar Reddy, W/o. Sridhar Babu,
**Nos. 25 to 27** are r/at D.No.28-1169-1, Ganganapalli, Chittoor Town & District.
**28. P.Kavitha,** W/o. Pakala Prabhakar Reddy, D.No.28-1169-1, Y.S.R. Street, Ganganapalle, Chittoor City
**40. P.Gurrappa Naidu** S/o Late P.Doraswamy Naidu, residing at Pathipativaripalli Village, Polakala Post, Irala Mandal, Chittoor District.

**Sir,** Whereas the above petitioner/ plaintiff filed the above I.A.No.189/ 2024 in OS No.127/2017 against you as respondents/ defendants 21, 25 to 28 & 40 in the above I.A. The above said petition stands posted to **02-01-2025** for your notice and appearance before the said court, please be present at about **10.30 AM** on the said date either in person, or through an Advocate failing which, the matter will be decided in your absence.
Hearing Date: **02-01-2025**

**Sd/- D.JANARDHANA NAIDU**
Advocate,Chittoor Cell:9440958395